# పండిత పుత్రుడు

మల్లాది వేంకటకృష్ణశర్మగారు

అతడు కటిక వైష్ణవుడు—ఇతడు వీర శైవుడు. అతడు మూర్ధాభిషిక్తుడు—ఇతడు పండిత మూర్ధన్యుడు. అతనికి వేలకొద్దీ నౌఖర్లున్నారు. ఇతనికి వేలకొద్దీ శిష్యులున్నారు. అతడు ప్రచండుడైన సార్వభౌముని మెప్పించి బిరుదునిశానీలను సంపాదించాడు. ఇతడు అమాయకులైన సమస్త మానవుల హృదయాలనూ కదిలించి బిరుదు నిశానీలను సంపాదించాడు.

అతడు రాజు—ఇతడు కవిరాజు. అతడు సర్వతంత్ర స్వతంత్రుడు—ఇతడూ సర్వతంత్రస్వతంత్రుడు—అతడు లక్ష్మీ వరప్రసాది—ఇతడు సరస్వతీ వరప్రసాది. సహజ వైరం సాగుతూంది.

అతడు సమయం దొరుకుతే చాలునని కత్తి గురిపెడుతున్నాడు. ఇతడు సమయం దొరుకుతే చాలు కలం గురిపెడుతున్నాడు. ఉన్నవూరు రాజుదైతే, సమస్త భూప్రదేశ కవిరాజుదయింది.

ఈ పోరాటమునకు ఫలముగా శతాబ్దగమన వేగమున నలిగిపోయిన శైవమతం విజృంభించడానికి ప్రారంభించింది. ఒకవ్యక్తి మీదుగా మహాగ్రంథములు శతాధికముగా లోకమునకు సమర్పింపబడ్డాయి. ఈ పోరాటమునకు ఫలముగా మతములోకూడా, తామస వృత్తి నవలంబించే రాజుల పట్టుదల, లోకులకు వ్యక్తమయింది: గ్రామమున మూడు వంతులు ఇండ్లగోడలపైనీ తలుపులపైనీ బలవంతాన పట్టెనామములు బయలుదేరేయి.

రాజు ధనము విరజిమ్ముతున్నాడు. కవిరాజు కావ్యామృతము విరజిమ్ముతున్నాడు. లోకులకు, రాజంటె భయమూ, కవిరాజంటే భక్తీ. అతనికి ఇతనికీ పోరాటం సాగుతూనే వుంది.

నిరంకుశుడైన రాజును మతములో కలిపి అరపాదముక్రింద నిలిపిన కవి సార్వభౌమునకు, తనయింటనే శత్రుబీజం మొలకలెత్తడం ప్రారంభించింది. మహా శక్తిసంపన్నుడూ విజయశాలీ అయిన పండితరాజు దుర్బలుడూ—నిరక్షరకుక్షీ అయిన యింటి శత్రువును జయించలేకుండా వున్నాడు.

♦ ♦ ♦

ఒడలు ముదురని రోజులలో రెండు కావ్యాలు చదివేడు. ఘాటుచాలక ఎంకి పాటలు ప్రారంభించాడు. తండ్రి సూత్ర భాష్యం వ్రాస్తే తాను ప్రణయరోదనం వ్రాశాడు. తండ్రి శైవసిద్ధాంత చర్చచేస్తే ఇతడు ప్రణయచర్చ వేశాడు. తండ్రి భారవిభవ భూతులను పేర్కొంటే తాను కృష్ణశాస్త్రి ముద్దుకృష్ణులను పేర్కొంటాడు. జనకుడు

గీతాపఠనము చేస్తే తనయుడు రాయప్రోలు వారి జడకుచ్చులో పారాయణము ప్రారంభించేడు.

తండ్రి దృష్టిలో కొడుకు విద్యావిహీనుడూ—భ్రష్టుడూ! కొడుకు దృష్టిలో తండ్రి కూడా అంతే......

కొసకు తండ్రిని జయించిన కొడుకయినాడు. తన అవినయవర్తనమునకు గురిచేశాడు. తండ్రియగు పండితరాజు కొడుకు డాకకు నిలువలేక చిక్కిచివికి, శల్యావశిష్టుడై ఒక నాడు కళ్లుమూసుకున్నాడు. ఈ వార్త విని రాజు విజయధ్వని చేశాడు. ఈ వార్త విని పుత్రుడు ప్రణయనృత్యం చేశాడు. ఆంధ్ర సరస్వతి కన్నీరుమున్నీరుగా ఏడిచింది.

భావకవి వలపులపాటతో కవిరాజు యొక్క భౌతికశరీరాని కగ్నితగిలించి, తండ్రి యొక్క కీర్తిశరీరంవంక నిప్పుకలు రేగే తీవ్రదృష్టి సారించాడు.

* * *

రాజుపంపిన నోట్లకట్టలు లెక్కచూచుకొని, ఇంటిముందు నిండుకున్న రాజభటుల తలలకు పుస్తకములకట్ట లెత్తించి రాజ సభామందిరము ప్రవేశించాడు. రాజు సామ్రాజ్య పట్టాభిషేకమునకు సంసిద్ధుడైనట్లు నిరంకుశదృష్టి ప్రసరిస్తూ పండిత పుత్రుణ్ణి ఆహ్వానించాడు. రాజు ముక్తకంఠముతో భావకవిని "నీతండ్రి మాకు పరమ మిత్రుడు—అయినా అతడు నా మతమునకు విరుద్ధముగా ప్రవర్తించడం నీకూ తెలుసును. నీతండ్రి వ్రాసిన యీపుస్తకాలెందుకు కొన్నానో నీకు తెలుసునా? చూడు" అని సేవకులకు పుస్తకములన్నీ ఒకచో పేర్చుమని ఆజ్ఞాపించాడు. తనకు కావలసిన గ్రంథాలన్నీ పరీక్షించి ప్రక్కనించున్న నౌకరుచేత వాటికి నిప్పుపెట్టించాడు. సురసుర కాగితాలు ముట్టుకొని మండుతున్నాయి. మంటలు పుస్తకాలన్నింటినీ ఆవరించాయి.

అక్షరాలు చూస్తూంటగా మాడిమాయమౌతున్నాయి. భావకవి రెప్పవెయ్యకుండా చూస్తున్నాడు. రాజు ఆనందవివశుడై తన్ను తానుమరచి జ్వాలలచుట్టూ పిశాచతాండవం చేస్తున్నాడు. భావకవి ఇంటివెన్నునంటుతూన్న మంటలలో చూపు స్థంభింపజేశాడు. ఆజ్వాలలలో పండితరాజు కనిపించినట్టయింది. ఎవరో ఆమంటలోంచి తన్ను శపిస్తూన్నట్టు వినిపించినది. మరిచూడలేక కళ్లుమూసుకున్నాడు. కళ్లువిప్పి చూచేసరికి చిరుగాలికి రేగుతూన్న మసిగుండ అతనికి కనిపించింది.

* * *